క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో మల్లాది విష్ణు


విష్ణుకు ప్రసాదాన్ని అందజేస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని విజయవాడ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ ఈవో వై.భద్రాజీ గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, మాధవ శర్మ, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రిఆచారి తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ


రాధిక

జి.సిగడాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా కె.రాధిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కలెక్టర్ కార్యాలయంలో పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన డీటీ ఎస్.నిర్మల టెక్కలికి బదిలీపై వెళ్లారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు భోజనాలను అందజేస్తున్న సర్పంచ్ కల్యాణి

జి.సిగడాం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టిన బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటుందని బాతువ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతిజ్ఞ శర్మ అన్నారు. సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 30 మంది గర్భిణులకు బాతువ సర్పంచ్ డబ్బాడ కల్యాణి భోజన సదుపాయం కల్పించారు. గత రెండేళ్లుగా గర్భిణులకు ప్రతి నెలా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఎంపీడీవోగా శైలజ


బాధ్యతలు తీసుకున్న శైలజ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం ఎంపీడీవోగా బొడ్డేపల్లి శైలజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన రామ్మోహన్ విజయనగరం బదిలీ అయ్యారు. కాగా శైలజను కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

శివారు గ్రామాలకు సాగునీరు అందిస్తాం


సాక్షి ఎఫెక్ట్...

ఎచ్చెర్ల క్యాంపస్: సాగునీటి కష్టాలు అనే కథనం సాక్షి పత్రికలో సోమవారం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఒక ప్రకటన విడుదల చేశారు. జైకా నిధులతో చేపడుతున్న పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపు డెక్కను యంత్రాలు, లస్కర్ వ్యవస్థ ద్వారా తొలగిస్తున్నట్లు చెప్పారు. కాలువ పొడవు సుమారు 60 కిలో మీటర్లు కావటం వల్ల వర్షాభావ పరిస్థితులు ప్రభావం ఉందన్నారు. ఫరీదుపేట, ఇబ్రహింబాద్, తమ్మినాయుడుపేట, పూడివలస గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. శివారు గ్రామాలకు కూడా సాధ్యమైనంత వరకు సాగునీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

కెమెరామెన్ కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం రూరల్: ఇటీవల మృతి చెందిన కెమెరామెన్ గుణ కుటుంబానికి జర్నలిస్టు సంఘాలు అండగా నిలిచాయి. మృతుని కుటుంబ సభ్యులను పలువురు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే ద్వారా రూ.10 వేలు, జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు సేకరించిన 54,500 రూపాయలను గుణ కుటుంబ సభ్యులకు అందజేశారు. జర్నలిస్టు సంఘాల నాయకులు నల్లి ధర్మారావు, ఈశ్వరరావు, జోగినాయుడు తదితరులున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువకులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పొన్నాం పంచాయతీ నవనంబాడు గ్రామంలోని హెల్త్‌సబ్‌సెంటర్ ఆవరణలో పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. దీంతో పాములు, ఇతర క్రిమికీటకాలు సంచరిస్తుండడంతో ఇక్కడకు వచ్చేవారు భయాందోళన చెందేవారు. స్థానికుల నాయకుల చొరవడంతో యువకులు పిచ్చిమొక్కలను శ్రమదానం ద్వారా సోమవారం తొలగించారు.

సజావుగా టెట్



ఏపీ టెట్ -2024 పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో సోమవారం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించారు. మొదటి షిఫ్టులో 100 మందికి 93 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 91 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

ఎచ్చెర్ల క్యాంపస్

ప్రదర్శన



శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి కోలాటం ప్రదర్శన అలరించింది. మండలేశ్వర కోలాట గ్రూప్, బలగ డ్యాన్సు ట్రూప్ మురళి అఖిల్ రాణి బృందంచే జరిగిన ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంప్రదాయం ప్రతినిధులు తరుణ్‌సాయిరెడ్డి, గణేష్‌రెడ్డి, భవానీ మాతలు ధనలక్ష్మీ, ఆమని, వేణు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఎండుతున్న వరి పంట


కుశాలపురంలో ఎండుతున్న వరిపంటలో కలుపు తీయటం సాధ్యం కాక విడిచిపెట్టిన రైతులు

ఈ ఖరీఫ్ సీజన్‌లో నారాయణపురం కుడి కాలువ కింద రైతులకు కన్నీరే మిగిలింది. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. సాగు కోసం వేలల్లో ఖర్చు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేని పరిస్థితి నారాయణపురం కుడి కాలువ కింద ఏర్పడింది. వరి పంటను దాదాపుగా రైతులు విడిచిపెట్టేశారు. రెండు వారాలుగా ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పొలంలో చుక్కనీరు లేక భీటలు వారాయి. ఈ ప్రభుత్వం నుంచి కూడా ఎటువంటి సాయం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్


నవభారత్ సమీపంలో చుక్క నీరులేక ఎండిపోతున్న వరి పంట


ఇబ్రహింబాద్ సమీపంలో వరి పొలంలో పగుళ్లు

19, 20 తేదీల్లో ప్రపంచ సాహితీ కళాజాతర


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్ : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 19, 20 తేదీల్లో ప్రపంచ సాహితీ కళాజాతర నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ మేరకు స్థానిక గ్రంథాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం శ్రీశ్రీ కళావేదిక జిల్లా కమిటీ నూతన గౌరవ అధ్యక్షుడు సురంగి మోహనరావు, అధ్యక్షుడు బుర్రి కుమారరాజు, ఉపాధ్యక్షుడు వావిలపల్లి రాజారావులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె.కె.రాములు, ప్రధాన కార్యదర్శి వి.రాజారావు, బి.మోహనగాంధీ, కె.వి.రాజారావు, ఎర్రమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీసీఎస్ ఎస్‌ఐ


ఎస్పీకి పూలమొక్క బహూకరిస్తున్న కృష్ణప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన కె.కృష్ణప్రసాద్ ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా వీఆర్‌లోనే ఉన్న ఈయన సీసీఎస్‌కు ఇటీవల బదిలీ అయ్యారు.

బైక్ చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాంఅక్కివలస పంచాయతీ పరిధి పట్టుశాలిపేటకు చెందిన వి.తవుడు తన బైక్ (పల్సర్) చోరీకి గురైందని సోమవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు పార్కు చేసిన బైక్ ఈ నెల 5వ తేదీ రాత్రి చోరీకి గురైనందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

ప్రణాళికతోనే అభివృద్ధి సాధ్యం


రణస్థలం: మాట్లాడుతున్న సాయికుమార్


గార: మాట్లాడుతున్న ఎంపీడీవో రామ్మోహనరావు

రణస్థలం: పక్కా ప్రణాళికల ద్వారానే పంచాయతీలు అభివృద్ధికి నోచుకుంటాయని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పంచాయతీల నిర్వహణలో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, వీధి లైట్ల నిర్వహణ తదితర మౌలిక అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

జి.సిగడాం: గ్రామాలాభివృద్ధికి వార్డు సభ్యులే కీలకమని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్, వార్డుల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామ ప్రగతిలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని మండల పంచాయతీ విస్తరణ అధికారి మల్లేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. 2024–25 ఏడాదికి సంబంధించి ప్రణాళిక సిద్ధం చేయటంతో కీలకంగా వ్యవహరించాలన్నారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

ప్రజా భాగస్వామ్యం అవసరం

గార: గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ గొండు రఘురామ్, జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు పాటు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీ చట్టాలపై ఇవ్వనున్న శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. గ్రామ సభలు, ఆర్థికపరమైన నిర్ణయాల్లో వార్డు సభ్యుల పాత్ర, అభివృద్ధి పనుల్లో నిర్ణయాలు చేయడం, ప్రభుత్వ పథకాల్లో అవగాహన పట్ల ప్రజలను భాగస్వామ్యం కల్పించడం వాటిపై ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు అవగాహన కల్పించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈవోపీఆర్డీ ఎం.రాము పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ. 50 వేల ఆర్థిక సాయం



శ్రీకాకుళం కల్చరల్: ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన చిన్నారి ముద్దాడ పవిత్ర కిడ్నీవ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న అరసవల్లిలోని బాలరంజనీ, ఎంసీఏ సంస్థలు వైద్యం కోసం రూ.50 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని పవిత్ర కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ముద్దాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, బెంగళూరుకు చెందిన నాగుమంత్రి వెంకట ఖ్యాతి పేరిట వారి తల్లిదండ్రులు రామన్, జ్యోత్స్నలు ఈ సాయాన్ని సమకూర్చారని పాఠశాల ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు తెలిపారు.

స్వచ్ఛ సిటీగా శ్రీకాకుళం

● జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం నగరాన్ని స్వచ్ఛ సిటీగా మార్చేందుకు కృషి చేయాలని, ప్రజలతో ముడిపడి ఉన్న పారిశుద్ధ్య వ్యవస్థపై ప్రత్యేకంగా దష్టి సారించాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లో మున్సిపల్ అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. నగరంలో పారిశుద్ధ్యం విషయంలో స్పష్టమైన మార్పు దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అభివద్ధి, పరిపాలనలో ప్రాధాన్యతలను ముందుగా గుర్తించాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి వేళల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు మరింత మెరుగు పడాలని సూచించారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరును మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటామని స్పష్టం చేశారు. శానిటేషన్ డ్రైవ్ సరిగ్గా జరగడం లేదనే ఫిర్యాదు ఒక్కటి కూడా రాకూడదన్నారు. ఈ విషయమై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను విచక్షణా రహితంగా వేయకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పన్నుల వసూళ్లు, కార్పొరేషన్ ఆదాయ వ్యయాలపై ఆరా తీశారు. చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇంటింటి చెత్త సేకరణ పూర్తిగా జరిగేలా 'డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ'గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, మున్సిపల్ ఇంజినీర్ పి.వి.గంగాధరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్‌కుమార్, టీపీఓ ఉమామహేశ్వరరావు, హార్టికల్చర్ ఏడీ పి.ప్రసాద్, వై.శివశంకర్, పలువురు ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు.

బాలత్రిపుర సుందరికి ఊరేగింపు


బాలత్రిపుర సుందరి ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర సుందరీ కాలభైరవ పీఠం దేవాలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని సోమవారం ఊరేగించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అలాగే పెద్దబబరాటం వీధిలోని నీలమ్మతల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. కమిటీ సభ్యులు బరాటం సాయిరాజ్, భక్తులు పాల్గొన్నారు.

పాత బిల్లులివ్వరు.. కొత్త పనులు చేయనివ్వరు!

● కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ల గగ్గోలు


సనపల తవిటయ్య, క్లాస్-3, కాంట్రాక్టర్, శ్రీకాకుళం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చేసిన పనులకు బిల్లులు చెల్లించక.. కొత్త పనులు చేయనివ్వకపోవడంతో శ్రీకాకుళం నగరపాలక సంస్థలోని పలువురు కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. పూర్తిచేసిన కాలువలు, రోడ్డు నిర్మాణాలకు సైతం నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈలు, ఎమినిటీ సెక్రటరీలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయిలు పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో చావే శరణ్యమని సనపల తవిటయ్య అనే క్లాస్–3 కాంట్రాక్టర్ 'సాక్షి'వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పని జరిగిన నెలరోజుల్లోపు ఎమ్‌బుక్ రికార్డు చేయాల్సి ఉండగా.. అలా చేయకుండా వదిలేయడంతో పూర్తిగా బిల్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. బిల్లులు రాకముందే కమీషన్ ఇవ్వాలని ఇంజినీర్లు ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. చాలామంది కాంట్రాక్టర్లు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. కమీషన్ ఇవ్వనందుకే తాను చేసిన పనులకు సంబంధించిన బిల్లులన్నీ పెండింగ్‌లో ఉంచి ఇబ్బంది పెడుతున్నారన్నారు. కమీషన్ ముందే ఇచ్చినవారికి పనులు పూర్తికాకుండానే ఎమ్ బుక్‌లు రికార్డ్ చేసి బిల్లులు చెల్లిస్తున్నట్టు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం పనులు చేసి కూడా బిల్లులు రాకుండా చాలామంది కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నట్టు తవితయ్య చెప్పారు. తాను చేసిన పనులకు సంబంధించిన వివరాలను సైతం వెల్లడించారు. రిమ్స్ ఆస్పత్రి రోడ్డుకి సమీపంలో మడ్డివీధిలో సీసీ రోడ్డు, కాలువ నిర్మాణం పనులను రూ.12 లక్షల అంచనా విలువతో 2023 నవంబర్ పనిదక్కించుకున్నారు. ఈ పనులకు సంబంధించి 2.5 శాతం అగ్రిమెంట్ కట్టానని.. దీనిలో రూ 1.70 లక్షల విలువైన పనిని జనవరి–2024లో పని పూర్తి చేసినట్టు చెప్పారు. చేసిన పనులకు నెల రోజుల్లోపు ఎమ్‌బుక్ రికార్డు చేయాల్సి ఉండగా అలా చేయకపోవడంతో ఇప్పటికీ బిల్లు రాలేద న్నారు. అలాగే ఈ ఏడాది జనవరి రాజీవ్‌స్వగృహకల్పన కాలనీలో రూ. 20 లక్షలు అంచనా వ్యవయంతో పనులు ప్రారంభించి రూ.10 లక్షల విలువైన పనులు పూర్తి చేశానన్నారు. జెడ్పీ సమీపంలో జెండాలవీధిలో రూ. 6 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు పనులు చేయాల్సి ఉండగా రూ. నాలుగు లక్షల విలువైన పనులు చేసినప్పటికీ బిల్లులు రాలేదని వాపోయారు. వీటితో పాటుమరికొన్ని పనులు చేసినప్పటికీ ఎమ్ బుక్‌లో నమోదు చేయకపోవడంతో బిల్లులు రాలేదని చెప్పారు. అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

నిబంధనలు పాటించడంలేదు

అగ్రిమెంట్‌లో ఉన్న నియమ నిబంధనలు పాటించాలని క్లాస్–3 కాంట్రాక్టర్ సనపల తవితయ్యను అడుగుతున్నాం. ఆయన అవేమి పాటించకపోవడంతో జాప్యం జరిగింది. సీఎఫ్‌ఎమ్‌ఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఉండడంతో బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరిగింది. అలాగే ఏ పని కూడా నిర్దేశిత సమయంలో చేయకుండా, నాణ్యతలోపాలతో చేయడం వల్ల మూడుసార్లు నోటీసులు జారీ చేశాం. ఇప్పటివరకు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు.

– ఎల్.సంతోష్, ఏఈ, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

అంగన్‌వాడీ యాప్‌లన్నీ ఒకే యాప్‌గా మార్చాలి


పీడీ శాంతిశ్రీకి వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో పీడీ బి.శాంతిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు కళ్యాణి, సుజాతలు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు లబ్ధిదారుల లిస్టును నమోదు చేయడానికి పోషణ ట్రాకర్ యాప్, బాలసంజీవని యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. గర్భిణులకు, బాలింతలకు ఎఫ్ఆర్‌ఎస్ ద్వారా టీహెచ్‌ఆర్ అందిస్తున్నామని చెప్పారు. మళ్లీ 5 రకాల రికార్డులను రాయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. ప్రభుత్వం రికార్డులు ఇవ్వడం లేదని, ఒక్కొక్కరు రూ.1000, రూ.1200 ఖర్చుపెట్టి రికార్డులు కొనుగోలు చేసి రాయడం వల్ల అంగన్‌వాడీలకు భారంగా ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో నెట్ సిగ్నల్స్ లేనందువల్ల యాప్‌లు నిర్వహించడానికి ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కొత్తగా 7 నెలల నుంచి 6సంవత్సరాల లోపు పిల్లలకు ఫొటోలు తీసి ఫుడ్ ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, ఇదీంతో ప్రీస్కూల్ నిర్వహణ దెబ్బతింటోందన్నారు. 42రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన విధంగా అన్ని యాప్‌లూ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, రికార్డు వర్క్ తగ్గించాలని, ప్రీస్కూల్ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రతినిధులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, పి.లత, కె.జ్యోతి తదితరులు ఉన్నారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట


అవార్డులు అందుకున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డాక్టర్ ఎ.గోపాలరావు గవర్నర్ 316 లయన్స్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు అవార్డులు వరించాయి. ఆదివారం రాత్రి విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో జరిగిన 316–ఏ లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డుల ప్రదానోత్సం జరిగింది. ఇందులో హర్షవల్లి లయన్స్‌క్లబ్‌కు ఏడు అవార్డుల దక్కాయి. క్లబ్ పూర్వ అధ్యక్షురాలు కరణం శోభారాణికి రెండు, ప్రస్తుత అధ్యక్షుడు వావిలపల్లి జగన్నాథనాయుడు, విద్యా సంక్షేమ చైర్మన్ హారికాప్రసాద్, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం జిల్లా చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, కోశాధికారి తర్లాడ అప్పలనాయుడు అవార్డులు అందుకున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తహసీల్దార్ శ్రీకాంత్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రీవెన్స్‌లో ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులకు నెలకున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించే దిశగా పని చేస్తున్నామని, ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరగవద్దన్నారు. అందరి సహకరంతోనే భూ సమస్యలను పరిష్కారం చేయగలమన్నారు డిప్యూటీ తహసీల్దార్ కె.రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు


లలితాదేవిగా విజయదుర్గ


నక్కవీధి ఉమాదేవిని లలితాత్రిపుర సుందరిగా

శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదుర్గ అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక నానుబాలవీధిలోని విజయదుర్గ అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. మొండేటివీధిలోని షిర్డీ సాయి మందిరంలో లలితాదేవి అమ్మవారిని మహాచండీమాతగా, నక్కవీధి ఉమాజలలేశ్వరస్వామి దేవాలయంలో ఉమాదేవిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. అలాగే పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలోని శివలింగానికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో అమ్మవారికి ద్వాదశ హారతులు ఇచ్చారు.